అభాగ్యులపై కూటమి కత్తి

8 ఏళ్లుగా వస్తున్న పింఛన్ తీసేశారు..



నాకు 2017లో జరిగిన ఓ ప్రమాదంలో రెండు కాళ్లు, చేయి చచ్చుబడింది. డాక్టర్లు 68 శాతం వైకల్యం ఉందని సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఎక్కడికైనా పోవాలన్నా ఎవరో ఒకరు సాయం ఉండాలి. అప్పటి నుంచి పింఛన్ తీసుకుంటున్నారు. ఇప్పుడు పింఛన్ రాలేదు. ఎందుకని అడిగితే నీకు కాళ్లు చేతులు బాగుండాయి అంటా ఉండారు. ఇప్పుడు అధికారుల ముందు వచ్చి నిలబడేసరికి.. సరే చూసి పంపిస్తామంటా ఉండారు. ఇది ధర్మమేనా..?

- నళిని, సంతపేట, చిత్తూరు.

పిల్లోడి ఆసరా ఆపేశారు..



నా భర్త కూలి పని చేస్తాడు. మా పిల్లోడు పుట్టి, పెరిగే కొద్దీ అందరి పిల్లల్లాగే కాకుండా మెతకగా ఉండే వాడు. డాక్టర్లకు చూపిస్తే బుద్ధిమాంద్యం అన్నారు. గవర్నమెంటు ఆస్పత్రిలో వైద్యం కూడా చేసుకుంటా ఉండాం. ఉన్నట్టుండి ఈనెల పింఛన్ ఆపేసినారు. నెలకు రూ.6 వేలు వస్తే.. కుటుంబానికి కాస్త ఆసరా ఉంటాది అనుకుంటే, దాన్ని ఆపేశారు.

- వహీద, తుమ్మింద, చిత్తూరు మండలం

కళ్లు కనిపించవు.. నా పొట్ట కొట్టారు



నాకు రెండు కళ్లు కనిపించవు. 70 శాతం వైకల్యం ఉందని డాక్టర్లు పరీక్షించి సర్టిఫికెట్ కూడా ఇచ్చినారు. ఇంటి నుంచి బయటకు రావాలన్నా.. మా ఇంటావిడ తోడు ఉండాల్సిందే. ఇప్పుడేమో నీకు కళ్లు బాగానే ఉండాయి. పింఛన్ రాదంటా ఉండారు. ఇదెక్కడి న్యాయం అయ్యా..?

- బాబు సాహెబ్, తుమ్మింద, చిత్తూరు మండలం

కాళ్లు చచ్చుబడి కొందరు నడవలేని పరిస్థితి. మరికొందరు ప్రమాదాల్లో చేతులు కోల్పోయి అన్నం కూడా తినలేని దైన్యం. ఇంకొందరు కళ్లు కనిపించక చూడలేని దయనీయ స్థితి. ఇలాంటి వాళ్లకు ప్రతీ నెలా అందుతున్న పింఛన్ సాయాన్ని కూటమి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా తొలగించింది. పైగా వీళ్లంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులంటూ ఆ పార్టీ నాయకులు చెబుతున్న మాటలు.. ఎంపీడీఓ కార్యాలయ వద్ద పోటెత్తుతున్న దివ్యాంగులను చూస్తే నిజం తెలుస్తుంది. చిత్తూరు నియోజకవర్గంలో ఇష్టానుసారం దివ్యాంగుల పింఛన్లు తొలగించడంతో.. లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– చిత్తూరు అర్బన్



చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద రీ-వెరిఫికేషన్ కోసం వేచి చూస్తున్న దివ్యాంగులు

- దివ్యాంగుల కడుపు కొట్టడానికి మనసెలా వచ్చింది చంద్రబాబు ?
- అచేతనస్థితిలో పడి ఉన్న వారి పింఛన్లను తొలగిస్తారా ?
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు
- రీ–వెరిఫికేషన్‌లో పత్రాలు ఇచ్చినా.. సర్దుబాటుపై సందేహం
- దివ్యాంగులు.. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులా..?

భారీగా కోత..

చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో గత నెల 2,594 మంది దివ్యాంగులు, మంచంపై లేవలేని స్థితిలో ఉన్న అభాగ్యులకు పింఛన్లు అందాయి. తాజాగా 593 మందిని అనర్హులుగా పేర్కొంటూ ప్రభుత్వం వాళ్లకు పింఛన్లు ఇవ్వలేదు. ఇక చిత్తూరు మండలంలో గతనెల 745 మంది పింఛన్లు తీసుకుంటే.. 175 మందిని తొలగించారు. గుడిపాలలో 912 మందికి గానూ 187 మంది లబ్ధిదారుల పేర్లను పింఛన్ల జాబితా నుంచి తొలగించారు. మొత్తంగా 4251 మంది లబ్ధిదారుల్లో 955 మంది పింఛన్లు రద్దు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోనే 187 మంది దివ్యాంగులను అధికారులు అనర్హుల జాబితాలో ఉంచారు అయితే. ఇందులో కనీసం నడవలేని వారు, మంచానికే పరిమితమైన వారినీ కూడా వదిలి పెట్టలేదు.

అర్హులైన వారిని గుర్తిస్తాం..

గుడిపాల ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం డాక్టర్ సంధ్య 189కొత్తపల్లె, గుడిపాల, పాపసముద్రం, బసవాపల్లె, చిత్తపార, రామభద్రాపురం, వసంతాపురం సచివాలయాలకు సంబంధించి 86 మందికి పింఛన్ల రీవెరిఫికేషన్ నిర్వహించారు. ఇందులో 79మంది తిరిగి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని సూచించారు. వీటని ఎంపీడీఓ లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. జిల్లాస్థాయి డాక్టర్లు మరొకసారి వారిని చెక్ చేసి సదరం సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు.



గుడిపాల: దివ్యాంగ పింఛన్‌దారులను పరిశీలిస్తున్న డాక్టర్ సంధ్య



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు మీనా. పాపసముద్రం గ్రామానికి చెందిన ఈమెకు మతిస్థిమితం సరిగా లేదు. కాళ్లు, చేయి మూర్ఛవ్యాధి కారణంగా పని చేయవు. పుట్టుక నుంచి ఈమెకు ఇదే పరిస్థితి. ఇంటివద్ద మచానికే పరిమితం. గురువారం రీ వెరిఫికేషన్ పేరుతో గుడిపాల ఎంపీడీఓ కార్యాలయానికి ఆటోలో కుటుంబ సభ్యులతో వచ్చింది. ఈమెకు రూ.15వేలు పింఛన్ అందేది. దాన్ని రూ.6వేలకు చేశారు. డాక్టర్ పరిశీలించి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు పవన్. ఇతనికి చిన్నప్పటి నుంచి చేతులు, కాళ్లు సరిగ్గా పనిచేయవు. తోడు లేకుండా ఏ పని చేసుకోలేదు. ఇతనికి వస్తున్న రూ.6 వేలు రద్దు అయినట్లు లెటర్ పంపించారు. ఆపై ఈ దివ్యాంగున్ని ఎంపీడీఓ కార్యాలయంలో రీవెరిఫికేషన్‌కు రావాలని సూచించారు. గురువారం అతన్ని డాక్టర్ పరిశీలించారు. పింఛన్ పోవడంపై వారి కటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు.

క్లుప్తంగా

మొగిలిలో ఆక్రమణల తొలగింపు



రహదారి పక్కన ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలను గురువారం తొలగించినట్లు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. శ్రీనిఫుడ్స్ సమీపంలో గల మొగిలి క్రాస్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, రహదారి ఆక్రమణలను ఆర్డీఓ భవానీ పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీస్, ఎన్‌హెచ్ అధికారులు తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి చంద్రమహేష్ తెలిపారు. మండలంలోని తుమ్మిందపాళ్యంలో గురువారం ఆయన తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. వేసవిలో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తవణంపల్లె: సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గోకులం షెడ్లను పూర్తి చేయండి

తవణంపల్లె: మండలంలో గోకులం షెడ్ల నిర్మాణ పనులను రైతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో గోకులంషెడ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గోకులం షెడ్లు మంజూరైన రైతులు వెంటనే పనులు చేపట్టాలన్నారు. గోకులంషెడ్ల నిర్మాణం ఉపయోగం గురించి వివరించారు. పనులు పూర్తి చేసిన రైతులకు సకాలంలో బిల్లులు అందుతాయని వివరించారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీఓ బాల, వెటర్నరీ అధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ లావణ్య, ఈజీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఆహ్వానం



జిల్లా ఎస్పీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు గురువారం పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరితో పాటు పలువురు అధికారులకు ఈఓ పెంచల కిషోర్ ఉత్సవ పత్రికను అందజేశారు.

నగదు, నగలు చోరీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లిలోని ఓ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మునిరాజులు అనే వ్యక్తి ఇంటి తలుపులు, బీరువా పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. కూలీపనికి వెళ్లిన మునిరాజులు, అతని భార్య ఇంటి తలుపులు, బీరువా పగలకొట్టిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూ.1.30 లక్షల నగదు, 10 సవర్ల బంగారం ఎత్తికెళ్లినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు ఇంటి వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన పలువురిపై అనుమానాలు వ్యక్తం చేశారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి



చిరంజీవి, ఎస్ఐ

తవణంపల్లె: చవితి సందర్భంగా గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు విధిగా అగ్నిమాపక శాఖ, విద్యుత్‌శాఖ, పోలీసు శాఖల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేసి చవితి ఉత్సవాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: వినాయక ప్రతిమలు కొలువుదీర్చే మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు, కమిటీ సభ్యులు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని బంగారుపాళెం సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అనుమమతులు పొందాలన్నారు. ఇందుకోసం పోలీస్‌శాఖ ganeshutsav.net అనే ప్రత్యేక వైబ్‌సైట్‌ను తీసుకు వచ్చిందన్నారు. ఆన్‌లైన్‌లో ఉత్సవాల నిర్వహణకు ఎన్‌ఓసీ పొందవచ్చన్నారు. పోలీసులు మండపాలను పరిశీలించి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ జారీ చేస్తారన్నారు. కమిటీ సభ్యుల వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలపాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను అనుసరించి ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.



తగ్గువారిపల్లెలో ఏర్పాటు చేస్తున్న మండపం



గణేష్ ఉత్సవ్ 2025 పర్మిషన్ లోగో

పోటీతత్వం ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి విద్యార్థికీ పోటీతత్వం ముఖ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీసీ వసతి గృహ అదనపు భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బీసీ వసతి గృహం నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ కళాశాలపై ఉన్న విశ్వా సంతో ఈ విద్యాసంవత్సరంలో 200కు పైగా నూతన అడ్మిషన్లు జరిగాయన్నారు. విద్యార్థులు ఖాళీ సమయంలో విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలకు బానిసలైతే విలువైన సమయం వృథా అవుతుందన్నారు. అనంతరం కళాశాల అభివృద్ధికి విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి రూ.40 లక్షలు విరాళంగా ప్రకటించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, కళాశాల సీపీడీసీ సెక్రటరీ వెంకటేశ్వరచౌదరి, సభ్యులు, ప్రిన్సిపల్ మనోహర్, వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



బీసీ బాలికల వసతి గృహం అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్

విద్యుత్ హమాలీల పొట్ట కొట్టవద్దు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ స్టోర్స్‌లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న హమాలీ కార్మికుల పొట్ట కొట్టవదని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్టోర్స్ ఎదుట నిరసన వ్యక్తం చేసి విద్యుత్ స్టోర్స్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరోగ్యదాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు మాట్లాడారు. కాంట్రాక్టర్లకు కాకుండా కార్మికుల సొసైటీకే టెండర్లు ఇవ్వాలన్నారు. అధికారులు అనాలోచిత నిర్ణయం వల్ల మూడో వ్యక్తికి టెండర్లకు పిలవడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు సొసైటీగా ఏర్పాటు చేసుకుని పీస్ రేటు పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ చేతిలో పెట్టాలని చూస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రోజువారి కూలీలు, కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక వారి పొట్ట కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే అనంతపురంలో ఈ విధానం కాంట్రాక్టర్‌కు ఇచ్చారని తెలిపారు. ఈ పద్ధతి మానుకుని కార్మికులకే ఇవ్వాలని ప్రస్తుత రేట్లు పెంచి ఈఎస్ఐ, పీఎఫ్ పెంచాలని డిమాండ్ చేశారు. టెండర్లు రద్దు చేయకపోతే ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చామని టెండర్లు రద్దు చేయకపోతే సెప్టెంబర్ 15 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, హమాలీ యూనియన్ నాయకులు ఆనంద్ కార్మికులు పాల్గొన్నారు.



స్టోర్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలి

చిత్తూరు కార్పొరేషన్: అర్హత కలిగిన వికలాంగుల పింఛన్లను రద్దు చేయరాదని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ రద్దుకు నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్‌ను ప్రస్తుతం రీ వెరిఫికేషన్ పేరిట తొలగించాలని కుట్ర చేయడం సరికాదన్నారు. ఇప్పటికే జిల్లాలో వేలాది మందికి సచివాలయ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. దివ్యాంగులకు జీవనధారమైన పింఛన్‌ను ఉన్నఫలంగా నిలిపివేస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై కలెక్టర్ జోక్యం చేసుకుని అర్హులను గుర్తించి పింఛన్లను పునరుద్ధరించాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. సమావేశంలో నాయకులు గోపీనాథ్, చంద్ర, మణిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

ఎవరు చెప్పినా ఆపేదేలే

గుడిపాల: చిత్తూరు ఆర్టీసీ డిపో వన్, టు డిపోలకు సంబంధించి ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు. చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులు నరహరిపేటలో ఆపాల్సి ఉంది. కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు బస్సును ఆపకుండా వెళ్తున్నారు. బస్టాప్ ఉంది కదా .. ఆపనప్పుడు మరి స్టాపింగ్ మాత్రం ఎందుకిచ్చారు అని లబ్ధిదారులు అడిగితే.. వారు స్పందించే తీరు ఇలా ఉంది. 'ఎవరు చెప్పినా మేం బస్సులు ఆపం.. డ్రైవింగ్ చేసేది మేము.. టిక్కెట్లు కొట్టేది మేము.. అధికారులు చెప్తే ఆపాలా ? మాకు టైం లేదు.. మీరు ఆర్ఎం, డీఎంలకు చెప్పినా మాకు భయం లేదు.. మేము ఆపమంటే ఆపం' అని తెగేసి చెబుతున్నారు.

బస్సులను ఆపేస్తాం : బస్సులను ఆపకుంటే నరహరిపేట వద్ద చిత్తూరు వన్, టు డిపోలకు సంబంధించి బస్సులను అంతా ఆపేస్తామని ప్రయాణికులు చెబుతున్నారు. ఎంతో కష్టపడి స్టాపింగ్ పెడితే బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఇష్టారీతిన దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు వాపోయారు. ఇక స్టాంపింగ్ వల్ల సుమారు 60 గ్రామాల ప్రజలకు సౌకర్యాంగా ఉండడమే కాకుండా టీటీడీ కల్యాణ మండపంతో పాటు పోలీస్‌స్టేషన్, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ కూడా ఉందన్నారు. ఇంత రద్దీగా ఉండే ప్రదేశంలో ఎందుకు బస్సులు ఆపరని వారు మండిపడుతున్నారు. ఆర్టీసీ వారు ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోతే బస్సులను నరహరిపేట వద్ద తొందరలో ఆపేస్తామని ప్రయాణికులు చెబుతున్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసులు

గుడిపాల: సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యమని ఉపాధిహామీ ఏపీఓ శ్రీనివాసులు, ఏపీఎం సాయి సుధ తెలిపారు. గురువారం వెలుగు కార్యాలయంలో వయోజన విద్య, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉల్లాస్–అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా నూరుశాతం నిరక్షరాస్యతను నిర్మూలించి అక్షరాస్యత సాధించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘమిత్రలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3,725 మంది నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందన్నారు. ఉల్లాస్ ఆంధ్ర కార్యక్రమం ద్వారా 1,650 మంది నిరక్షరాస్యులను గుర్తించి వలంటీర్ల ద్వారా సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు డిజిటల్, ఆర్థిక, ఆరోగ్య, న్యాయ అక్షరాస్యతలు, సామాజిక అక్షరాస్యతపై అవగాహన కల్పించి 2029 సంవత్సరం నాటికి నూరుశాతం అక్షరాస్యులుగా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు.

పట్టువస్త్రాల సమర్పణకు ఉత్తర్వులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈనెల 27వ తేదీన మంత్రి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు లేగ దూడల ప్రదర్శన

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తామని వెటర్నరీ అధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. సంకరజాతి లేగ దూడలు 0–18 నెలల వయస్సు ఉన్న సుమారు 50 దూడలను ప్రదర్శిస్తామని వివరించారు. ఇందులో మూడు ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు. రైతులు లేగ దూడలను తీసుకొచ్చి ప్రదర్శనలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

తాత్కాలిక విద్యుత్ తీసుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు తాత్కాలిక విద్యుత్ అనుమతులు తీసుకోవాలని ఆ శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు 250 వ్యాట్ల విద్యుత్ వాడకానికి రూ.500, 250–500 వ్యాట్లకు రూ.1000, 500 వ్యాట్ల పైన వాడకానికి రూ.1500, తర్వాత వాడే ప్రతి 500 వ్యాట్లకు రూ.750 చెల్లించాలన్నారు. రుసుం మీసేవాలో చెల్లించి 11 రోజుల పాటు విద్యుత్‌ను వినియోగించుకోవచ్చన్నారు.

కాణిపాకంలో ఆర్‌జేసీ తనిఖీలు



లడ్డూ పోటును పరిశీలిస్తున్న ఆర్‌జేసీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని పలు విభాగాలను గురువారం ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డుపోటు, అన్నదాన భవనంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పులిహోర, లడ్డూను రుచి చూశారు. అన్నదాన భవనంలో భక్తులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డీఈఓ సాగర్ బాబు, ఏఈఓలు ప్రసాద్, హరి మాధవరెడ్డి, ధనుంజయ, సిబ్బంది కోదండపాణి పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు అన్యాయం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కాణిపాకం: దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు తీవ్రంగా విమర్శించారు. చిత్తూరు నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ పేరిట పింఛన్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఉన్నఫలంగా పింఛన్లను తొలగించడం దారుణమన్నారు. దీంతో చాలామంది దివ్యాంగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నిలిపివేసిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సి.గోపీనాథ్, దాసరి చంద్ర, కే.మణి పాల్గొన్నారు